జాగిలాల పరేడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

నైపుణ్యాల ప్రదర్శనకు 'పోలీస్ డ్యూటీ మీట్' చక్కని వేదిక

- ఎస్పీ అశోక్ కుమార్
- జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో 'పోలీస్ డ్యూటీ మీట్' ప్రారంభం

జగిత్యాల కలెక్టరేట్, సెప్టెంబర్ 25: పోలీస్ నైపుణ్యాల ప్రదర్శన, కొత్త విషయాలు తెలుసుకోవడం, సాంకేతిక పరిజ్ఞానంలో మెలకువలు నేర్చుకోవడానికి, ఆలోచనలు మార్పిడికి పోలీస్ డ్యూటీ మీట్ చక్కని వేదిక అని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం పోలీస్ డ్యూటీ మీట్‌ను ప్రారంభించి, మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానం, కేసుల దర్యాప్తులో మెలకవులు నేర్చుకోవడానికి పోలీస్ డ్యూటీ మీట్ దోహదపడుతుందన్నారు. డ్యూటీ మీట్‌లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయికి పంపిస్తామన్నారు. పోలీస్ డ్యూటీ మీట్‌లో కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, హ్యాండ్లింగ్, లిఫ్టింగ్, ప్యాకింగ్ విభాగం, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, పోలీస్ జాగిలాల ట్రాకింగ్ జాగింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఇక్కడ ఏఎస్పీ భీమ్‌రావు, డీఎస్పీలు రవిందర్రకుమార్, రంగారెడ్డి, సీఐలు శ్రీనివాస్, రఫీఖాన్, లక్ష్మీనారాయణ, రామనర్సింహారెడ్డి, రవి, సురేశ్, ఆర్ఐలు కిరణ్‌కుమార్, వేణు, ఎస్ఐలు ఉన్నారు.

ఎస్పీని కలిసిన ట్రయినీ ఎస్ఐలు

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్‌ను ట్రయినీ ఎస్ఐలు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అంకితభావంతో విధులు నిర్వర్తించాలని వారికి ఎస్పీ సూచించారు. అనంతరం ట్రయినీ ఎస్ఐలను ఆయన అభినందించారు.

వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ కోసం దరఖాస్తు చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల రూరల్, సెప్టెంబర్25: ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉండాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన జగిత్యాల మండలం తాటిపల్లిలోని ఆర్టీవో కార్యాలయానికి స్వయంగా వెళ్లి డ్రైవింగ్ లైసెన్స్‌ను రెన్యువల్ చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో వెళ్లేవారు సీట్‌బెల్టు వాడాలన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. ఇక్కడ డీటీవో శ్రీనివాస్, ఎంవీఐలు రామారావు, వెంకటన్న, ప్రమీల, నాయకులు నాడెం శంకర్, అంజన్న, గంగరెడ్డి, శ్రీకాంత్, గిరి ఉన్నారు.

జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలకు హాజరు

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 25: జిల్లా కేంద్రంలోని డీఎల్ గార్డెన్స్‌లో బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించగా, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఇక్కడ డీఐఈవో వెంకటేశ్వర్లు, బాలికల, ప్రభుత్వ, గొలపల్లి జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అలియాబేగం, దాసరి నాగభూషణం, మల్లయ్య, అధ్యాపకుల సంఘం 475రాష్ట్ర నేత కంకణాల శ్రీనివాస్, అధ్యాపకులు శ్రీహరి, శ్రీనివాస్, యాకూబ్ అలీ, రామకృష్ణ, నరేందర్, స్వప్న, రాజేశ్వరి ఉన్నారు.

కేసీఆర్ కిట్లు.. ఇస్తే బాగుండు

దవాఖాన సూపరింటెండెంట్ రాములు, వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ చైర్‌పర్సన్ వసంత

- యూరిన్ పైపు వేసేందుకు డబ్బులు తీసుకున్నరు
- పొద్దున 12 గంటలు దాటితే డాక్టర్లు అందుబాటులో ఉండరు
- పక్షవాతం వచ్చిన వారికి రోజుకు ఒక్కగోలితో వైద్యం చేస్తున్నరు
- స్కానింగ్‌కు వస్తే, కూర్చునేందుకు కుర్చీలేదు సార్
- దవాఖాన భోజనం అధ్వాన్నం.. అపరిశుభ్రం
- కంపుకొడుతున్న మూత్రశాలలు, మరుగుదొడ్లు
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్లతో జగిత్యాల ఏరియా దవాఖాన రోగుల మొర

జగిత్యాల, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): జిల్లా కేంద్రంలోని ప్రధాన దవాఖానను బీఆర్ఎస్ వైద్య ఆరోగ్య త్రీమెన్ కమిటీ మెంబర్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల బుధవారం ఉదయం పరిశీలించగా, రోగులు, వారి కుటుంబసభ్యులు గోడు వెల్లబోసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన రాథోడ్ అమూల్ కడుపునొప్పితో బాధపడుతూ స్కానింగ్ విభాగం సమీపంలో నేలపైనే కూర్చొని ఇబ్బందిపడుతుండడంతో ఎమ్మెల్యే ఏమైందని ప్రశ్నించగా, స్కానింగ్ వైద్యురాలు పది గంటలు అవుతున్నా అందుబాటులో లేదని, సిబ్బంది పట్టించుకోవడం లేదని వాపోయాడు. వెంటనే సిబ్బందితో మాట్లాడి అమూల్‌ను స్కానింగ్ విభాగం లోపలికి పంపించే ఏర్పాట్లు చేశారు. స్కానింగ్ విభాగం వద్ద రోగులు కూర్చునేందుకు కుర్చీలు సైతం అందుబాటులో లేకపోవడం, రేడియాలజీ విభాగానికి చెందిన డాక్టర దీప్తి పది గంటలైనా దవాఖానకు రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్ దీప్తి నిత్యం కరీంనగర్ నుంచి వచ్చి విధులు నిర్వర్తిస్తారని, అందుకే ఆలస్యమవుతున్నట్లు గుర్తించారు. ఇక ఇన్‌పేషెంట్‌గా ఉన్న చింతకుంటకు చెందిన లక్ష్మణ్‌ను ఎమ్మెల్యే, పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధర్మపురి మండలం ఆరపెల్లికి చెందిన విష్ణువర్ధన్ అనే అనీమియా పేషెంట్‌ను కలిసి విచారించడంతో పాటు, డాక్టర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. విష్ణువర్ధన్ నడుం నొప్పితో బాధపడుతుండడంతో స్వయంగా ఎమ్మెల్యే పరీక్షించి వైద్యుడికి సలహాలు ఇచ్చారు. కథలాపూర్ మండలం తాండ్రాలకు చెందిన తారయ్య పక్షవాతంతో చికిత్స పొందుతుండగా, అతడిని డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పరీక్షించారు. ఫిజియోథెరపీ చేయించుకోవాలని, దవాఖానలో కొన్నాళ్లు ఉండాలని సూచించారు. అతడికి కాసేపు స్వయంగా డాక్టర్ సంజయ్ ఫిజియోథెరపీ చేశారు. జగిత్యాలకు చెందిన బాలమణికి పక్షవాతం రావడంతో దవాఖానకు తీసుకువచ్చామని, అయితే రోజుకు ఒక్క గోలి మాత్రమే ఇస్తున్నారని, ఎలాంటి వైద్యం అందడం లేదని, వార్డు బాయ్ రావడం లేదని, డాక్టర్లు ఉదయం 12గంటల తర్వాత అందుబాటులో ఉండడం లేదని, వీల్‌చైర్ సైతం తెచ్చేవారు లేరని రాజుయాదవ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చాడు. దవాఖానలోని సమస్యలను ఏకరువు పెట్టాడు. సిటీస్కాన్ సరిగా పని చేయడం లేదని, ఎంఆర్ఐ స్కాన్‌ను బయటకు వెళ్లి చేయించుకురావాలని చెప్పారని, అది ఖర్చుతో కూడుకున్నదని వాపోయాడు. దవాఖాన సిబ్బందికి ₹వంద ఇస్తేనే పేషంట్‌కు యూరిన్ పైప్ వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులు, సిబ్బంది సరిగా పనిచేయడం లేదని ప్రశ్నిస్తే, సిబ్బంది రోగులు, వారి బంధువులను బెదిరిస్తున్నారని రాజుయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పక్షవాతంతో బాధపడుతున్న బాలమణిని కలిసి ఆమెను ఎమ్మెల్యే పరీక్షించి, ఆరోపణలు రాకుండా వ్యవహరించాలని దవాఖాన సూపరింటెండెంట్‌తో పాటు, నర్సింగ్ సిబ్బందికి సూచించారు. తర్వాత ఆవరణలో ఉన్న రోగులకు సంబంధించిన భోజన తయారీ కేంద్రాన్ని పరిశీలించి, అపరిశుభ్రంగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు అపరిశుభ్రంగా ఉన్నచోట, భోజనం తయారు చేయడం సరికాదని సూచించారు. తర్వాత మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా బాలింతలు, బాలింతల తరపున అక్కడ ఉన్న వారి బంధువులు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వసతులతో కేసీఆర్ కిట్లు పంపిణీ చేసేదని, మగ బిడ్డ జన్మిస్తే ₹12వేలు, ఆడపిల్ల అయితే ₹13వేలు సాయం ఇచ్చేదని, ఇప్పుడు అవి రావడం లేదని, వచ్చేలా చూడాలని కోరారు. కాగా ఎమ్మెల్యే సంజయ్ సైతం గతంలో పారితోషికాలు, ప్రోత్సాహకాలు ఇవ్వడం వల్ల ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య 70 శాతానికి చేరిందని, ఇప్పుడు మళ్లీ 40 శాతానికి పడిపోవడం బాధాకరమన్నారు. వీలైనంత వరకు ప్రసవాలు ప్రభుత్వ దవాఖానల్లో జరిగేలా చూడాలని సూచించారు.

రెండు గంటలకుపైగా పరిశీలన

జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రధాన దవాఖానను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత బుధవారం ఉదయం ఆకస్మికంగా పరిశీలించారు. దాదాపు రెండు గంటల పాటు పాతబస్టాండ్ సమీపంలో ఉన్న పూర్వ దవాఖాన భవనం, తర్వాత మాతా శిశు సంరక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న కొత్త దవాఖాన విభాగాల్లో ఉన్న అన్ని వార్డులను పరిశీలించారు. వైద్యులు, వైద్య సిబ్బంది, రోగులు, వారి కుటుంబ సభ్యులను కలిసి వారితో మాట్లాడారు. తొలుత అవుట్ పేషెంట్ నమోదు విభాగానికి వెళ్లి, వివరాలు తెలుసుకున్నారు. ప్రతి రోజు దవాఖానకు వెయ్యి మంది పేషెంట్లు వస్తున్నారని సిబ్బంది తెలియజేశారు. మంగళవారం 992 మంది అవుట్ పేషెంట్లు నమోదయ్యారని, దవాఖానలో జనరల్ మెడిసిన్ విభాగానికి రోజువారీగా సగటున 300 మంది పేషెంట్లు జనరల్ మెడిసిన్ విభాగంలో వస్తున్నారని, మంగళవారం 322 మంది నమోదయ్యారని పేర్కొన్నారు. తర్వాత ఫార్మసీ విభాగానికి వెళ్లి, మందుల కొరతపై సూపరింటెండెంట్ డాక్టర్ రాములును ప్రశ్నించారు. మెడిసిన్ సరిపోయంతగా సరఫరా అవుతున్నదని, కొన్ని మందులను స్థానికంగా కొనుగోలు చేస్తున్నామని వివరించారు. అయితే సర్జికల్ విభాగానికి సంబంధించిన మందులు, ఇతర పరికరాలు కొనుగోలు చేసేందుకు కొంత నిధుల కొరత ఉందని ఆయన పేర్కొన్నారు. ఫార్మసీలో మందుల కోసం వచ్చిన తుంగూరు గ్రామానికి చెందిన మహిళలను ఎమ్మెల్యే వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. తర్వాత మాతా శిశు సంరక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న మరో వింగ్‌ను పరిశీలించారు. సెప్టెంబర్‌లో ఇప్పటి వరకు 82 సాధారణ కాన్పులు, 142 సిజేరియన్లు జరిగినట్లు పేర్కొన్న బోర్డును పరిశీలించి, ఎమ్మెల్యే, సకల సదుపాయాలతో ఉన్న జిల్లా కేంద్ర దవాఖానలో సిజేరియన్లు ఎక్కువ కావడం సరికాదన్నారు. వీలైనంత వరకు సాధారణ కాన్పు అయ్యేలా చూడాలని వైద్యులను కోరారు.

ఫార్మసీ కేంద్రం వద్ద మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దరఖాస్తుల ఆహ్వానం

మేడిపల్లి, సెప్టెంబర్ 25: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 2024-05 విద్యా సంవత్సరానికి గానూ ఖాళీగా ఉన్న పీజీటీ ఇంగ్లిష్ పోస్టుకు దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డీ నాగసుధారాణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గంటల ప్రాతిపదికన 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్‌లో ఇంగ్లిష్ తరగతులు బోధించడానికి సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీ చేసినవారు తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 28 లోగా పాఠశాల పని వేళలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డీ నాగసుధారాణి తెలిపారు. మరింత సమాచారం కోసం మొబైల్ నంబర్ (9573469137) ను సంప్రదించాలని ఆమె సూచించారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్, పక్కన ప్రభుత్వ విప్ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ

కలిసికట్టుగా పనిచేద్దాం

- బాధితులకు అండగా నిలుద్దాం
- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ మీటింగ్‌కు హాజరు

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 25: కలిసికట్టుగా పనిచేసి.. బాధితులకు అండగా నిలుద్దామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టర్ బీ సత్యప్రసాద్ అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నూతనంగా ఏర్పాటైన జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ముఖ్యంగా జిల్లాలో వివిధ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను అధికారులు పరిష్కరించాలన్నారు. ఆదివాసీలు, గిరిజనుల భూములు కబ్జా కాకుండా చూడాలని పోలీస్ యంత్రాంగాన్ని కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిహారంలో జాప్యం లేకుండా సీఎంతో మాట్లాడి నిధులు తీసుకువస్తానని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ, రాయికల్ మండలం కోయగూడెంలో ఆదివాసీలకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు గ్రామాన్ని విజిట్ చేసి రిపోర్ట్ సమర్పించాలని ఆర్డీవోను ఆదేశించా రు. అనంతరం జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు, కేసుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, బాధితులకు అందించాల్సిన పరిహారంపై చర్చించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్‌కుమార్, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, ఎస్పీ అశోక్‌కుమార్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి కే రాజ్‌కుమార్, జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ సాయి బాబా, డీఎస్పీలు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈజీఎస్‌లో అవకతవకలకు చోటులేదు

- జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రఘువరణ్
- పలు గ్రామాల్లో సామాజిక తనిఖీలు

వెల్గటూర్, సెప్టెంబర్ 25: ఉపాధిహామీ పథకంలో అవకతవకలకు అవకాశం లేకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రఘువరణ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఈజీఎస్ మండల స్థాయి ప్రజా వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా రఘువరన్ మాట్లాడుతూ, ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఇలాంటి పథకంలో అవకతవకలు జరుగకుండా అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని కోరారు. ఈ పనుల్లో రూ.29వేలు రికవరీ కాగా, మండల స్థాయి అధికారులకు రూ.54వేల జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఆర్‌డీవో మదన్‌మోహన్, అంబుడ్స్‌మెన్ కృష్ణారెడ్డి, డీపీవో చిన్నయ్య, ఏపీవో దేవేందర్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ పాండురంగారావు, ఎంపీడీఓలు ఆకుల సంజీవరావు, విజయలక్ష్మి, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో అనిల్, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన రాష్ట్ర అధికారుల బృందం

కథలాపూర్, సెప్టెంబర్ 25: దుంపేట, సిరికొండ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ రాష్ట్ర అధికారుల బృందం రాహుల్, రావణ్ బుధవారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం నిల్వలు, రికార్డులను పరిశీలించారు. చిన్నారుల బరువులను తూకం వేసి ఎత్తుకు తగిన బరువు ఉండేలా చూడాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచనలు చేశారు. ఆటపాటల ద్వారా చిన్నారులకు బోదిస్తున్న తీరును పరిశీలించారు. వారి వెంట జిల్లా సంక్షేమశాఖ అధికారి నరేశ్, ఈవో పవిత్ర, జిల్లా పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ మధుకుమార్, సీడీపీవో మణెమ్మ, వీసీ ప్రశాంత్, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు ఉన్నారు.

పీఆర్సీ అమలు చేయండి

- 'ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు'లను రెగ్యులర్ చేయాలి
- టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ విజ్ఞప్తి

వేములవాడ, సెప్టెంబర్ 25: దేవాదాయశాఖ ఉద్యోగులకు ఇప్పటికే నాలుగు పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయని, కనీసం మూడింటిని ఈ పండుగలోగా విడుదల చేయాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, 261 జీవోను సవరించి ఉద్యోగులందరినీ ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చి న్యాయం చేయాలని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పేర్కొన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని హోటల్ ఎస్ఆర్ఆర్ గ్రాండ్‌లో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ. దేవాదాయ శాఖలో 1975 నాటి క్యాడర్ స్ట్రెంత్‌నే ఇప్పటికీ అమలు చేస్తున్నారని తెలిపారు. ఆలయాల్లో భక్తుల రద్దీ, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ఐదేండ్లకోసారి క్యాడర్ స్ట్రెంత్‌ను రివైజ్ చేయాలని సూచించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. 317 జీవో తీసుకొచ్చి జోనల్ వ్యవస్థలో బదిలీచేసి ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని చెప్పారు.

రైతులకు కంగన క్షమాపణ

రైతు చట్టాలపై వ్యాఖ్యలు వెనక్కి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25: తన దురుసు వ్యాఖ్యలతో నోరు పారేసుకున్న నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ రైతులకు క్షమాపణ చెప్పారు. 2021లో కేంద్రం రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలంటూ ఆమె ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వివాదాస్పద రైతు చట్టాలపై తాను చేసిన వ్యాఖ్యలు చాలామందిని అసంతృప్తి, బాధకు గురి చేశాయని, దీనికి తనను క్షమించాలని ఆమె కోరారు. 'కొద్ది రోజుల క్రితం రైతు చట్టాలపై మీడియా నన్ను కొన్ని ప్రశ్నలు వేసింది. గతంలో రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలని నేను ప్రధాని మోదీని కోరుతానని చెప్పా. అయితే నేను చేసిన ఈ ప్రకటన చాలామందిని బాధించింది. నా ప్రకటన వెనక్కి తీసుకుంటూ క్షమాపణలు చెబుతున్నా. నేనొక బీజేపీ కార్యకర్తను. నేను చేసే ప్రకటనలు పార్టీ అభిప్రాయాన్ని ప్రతిబింబించేవిగా ఉండాలి తప్ప, వ్యక్తిగతంగా ఉండకూడదు' అని ఆమె ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. కాగా, కంగనా చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని, వాటికి పార్టీతో సంబంధం లేదని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా అంతకుముందు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పైవేటు భవనానికి సర్కారీ సోకులు!

- శంషాబాద్ డబ్ల్యూటీసీ భవనంలో ఏఐ ఫెసిలిటీ సెంటర్
- అసంపూర్తి నిర్మాణంలో తాత్కాలిక కేంద్రం
- ట్రైసిటీల్లో అందుబాటులో సర్కారీ భవనాలు
- కపిల్ గ్రూపుతో ఐటీశాఖ ఒప్పందంపై ఆరోపణలు

ఫోర్త్ సిటీ.. 'ఫ్యూచర్' ట్రేడింగ్!

ప్రత్యేక కథనం - 8

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్.. ఫోర్త్ అలియాస్ ఫ్యూచర్ సిటీలో 200 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఏఐ సిటీ నిర్మాణ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేస్తున్న సెంటర్. అంటే తాత్కాలిక కేంద్రమన్న మాట. ప్రభుత్వ పరంగా టీ-హబ్, టీ-వర్క్స్, ట్రిపుల్ ఐటీ.. ఇలా చెప్పుకుంటూ పోతే లక్షల చదరపు అడుగుల్లో విశాలమైన , అద్భుతమైన భవనాలు అందుబాటులో ఉండగా అసంపూర్తి అద్దె భవనంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎప్పుడు పూర్తవుతుందో తెలియని ఈ భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్‌ను ఎందుకు ఏర్పాటు చేస్తున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీకి రానున్న రోజుల్లో ఎంతో ప్రాధాన్యం ఉండనుందని కేసీఆర్ ప్రభుత్వం ఆదిలోనే గుర్తించింది. అందుకే హైదరాబాద్ వేదికగా ఏఐ గ్లోబల్ సమ్మిట్-2024 నిర్వహించేందుకు గతంలోనే చొరవ తీసుకుంది. కొన్నిరోజుల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏఐ ప్రాధాన్యత దృష్ట్యా 'ఏఐ గ్లోబల్ సమ్మిట్-2024'ను నిర్వహించింది. ఈ క్రమంలోనే ఏఐ సిటీని ఏర్పాటు చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, సిటీ నిర్మాణం పూర్తయ్యే వరకు కార్యకలాపాలు, పురోగతి, ఇతరత్రా వ్యవహారాలన్నింటినీ పర్యవేక్షించేందుకు ఒక కేంద్రం కావాలి. అదే ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్. దీనిని ఏర్పాటు చేస్తున్నట్టు సమ్మిట్ వేదికగానే రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. కాకపోతే ఆ కేంద్రాన్ని శంషాబాద్‌లోని ప్రపంచ వాణిజ్య కేంద్రం (వరల్డ్ ట్రేడ్ సెంటర్)లోని రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇదే అందరినీ విస్మయానికి గురి చేసింది.

ఇంతకీ ఏమిటీ డబ్ల్యూటీసీ?

దేశంలోనే అతిపెద్ద వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నామంటూ జూన్ 2022 నగరానికి చెందిన కపిల్ గ్రూపు ఆర్భాటంగా ప్రకటించింది. శంషాబాద్ విమానాశ్రయం తూర్పు ముఖం దగ్గర శ్రీశైలం హైవేను అనుకొని 50-60 ఎకరాల్లో 12 అంతస్తులతో కూడిన భవనాన్ని నిర్మిస్తామని చెప్పింది. ఇందుకోసం సుమారు రూ.4 వేల కోట్లను పెట్టుబడిగా పెడుతున్నట్టు ప్రకటించింది. కారణాలు ఏవైనా ఆ ప్రాజెక్టు ఇప్పటివరకు పూర్తి కాలేదు. కేవలం గ్రౌండ్ ఫ్లోర్ సహా మూడు అంతస్తులతో కూడిన రెండు టవర్ల నిర్మాణం మాత్రమే ఇప్పటికీ పురోగతిలో ఉంది. అంటే మూడేండ్ల కిందట మొదలుపెట్టిన ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తి కాలేదు. ప్రస్తుతం వేగంగా పనులు కొనసాగించినా ప్రాజెక్టు పూర్తయ్యేందుకు మరో ఏడాది పట్టే అవకాశం ఉంది. ఇలాంటి అసంపూర్తి భవనాల్లో ఏఐ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

ఒప్పందంలోని షరతులేమిటో?

శంషాబాద్ విమానాశ్రయం తూర్పు వైపు నిర్మిస్తున్న డబ్ల్యూటీసీ శంషాబాద్ ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణం వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి పూర్తవుతుందని కంపెనీ చెప్తున్నది. అలాంటప్పుడు ఏడాది తర్వాత పూర్తయ్యే భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం గమనార్హం. ఆ మేరకు ఒప్పందం కూడా పూర్తయినట్టు తెలుస్తున్నది. అయితే, ఆ ఒప్పందంలో ఏముందనేది మాత్రం బయటికి రావడం లేదు. ఏడాదికి గాని పూర్తికాని భవనంలో తాత్కాలిక సెంటర్ ఏర్పాటు చేయాలనుకోవడం ఒక ఎత్తయితే, ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం తరపున సదరు గ్రూపునకు ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలు ఏమిటన్నవి తెలియరాలేదు. భవనం పూర్తయ్యాక సెంటర్ ఏర్పాటు చేస్తారా? లేదంటే భవనం పూర్తికి ప్రభుత్వ పరంగా ఆర్థికంగా చేయూత అందిస్తారా? అసలు ఆ భవనాన్ని ఎంచుకోవడానికి కారణం ఏమిటి? ఇలా అనేక సందేహాలు అందరి మెదళ్లను తొలుస్తున్నాయి. ఇందుకు సంబంధించి అన్ని వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

ఈ భూమాయకు సంబంధించిన వివరాలు మీ దగ్గర ఉంటే మాకు వాట్సాప్ చేయండి
91827 77711

టీ హబ్ కేంద్రంగా 60కి పైగా ఏఐ స్టార్టప్‌లు

కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీ-హబ్ అంతర్జాతీయస్థాయిలో టెక్నాలజీ స్టార్టప్‌లకు కేంద్రంగా మారింది. ఐటీ కారిడార్‌లో అత్యంత విశాలమైన ప్రాంగణంలో ఉన్న టీ-హబ్‌లో రకరకాల టెక్నాలజీ స్టార్టప్‌లు ఉన్నాయి. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)కి సంబంధించిన టెక్నాలజీ స్టార్టప్‌లే 60కి పైగా ఉన్నాయి. ఇక్కడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏఐ స్టార్టప్‌లను ప్రోత్సహించేలా ప్రత్యేకంగా వ్యవస్థలు ఏర్పాటయ్యాయి. స్టార్టప్‌లకు, ఐటీ కంపెనీలకు ఎంతో అనుకూలంగా ఉండే ఏఐ ఫెసిలిటీ సెంటర్‌ను ఇక్కడ